సాక్షి చిత్తూరు


గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.69

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	17
తిరుపతి	34	16
తిరుమల	31	19
గూడూరు	34	19
నగరి	35	18



పరమ పావనం.. గిరి ప్రదక్షిణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం నూతన వధూవరులైన ఆదిదంపతులు బుధవారం ఉదయం కైలాసగిరి ప్రదక్షిణ చేశారు. కొండచుట్టు ఉత్సవంలో విదేశీ భక్తులు సందడి చేశారు.

8లో▸

న్యూస్‌రీల్

పూడి రైల్వే గేటు మరమ్మతులు పూర్తి



వడమాలపేట : మండల పరిధిలోని పూడి రైల్వే గేటు మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం నుంచి వాహనాలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. గేటు ప్రాంతంలో గుంతలతో వాహనదారులు అవస్థలు పడేవారు. నాలుగు రోజులుగా రాత్రి పూట రాకపోకలు నిలిపివేసి ట్రాక్ మర మ్మతులు, తారురోడ్డు నిర్మాణ పనులు రైల్వే అధికా రులు పూర్తి చేశారు. ఇక వాహనదారులు సాఫీగా ప్రయాణం చేయవచ్చు.

ఆక్రమిత భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

నగరి : మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో ఆక్రమణకు గురైన భూములను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సా యంత్రం పరిశీలించారు. బుధ వారం 'సాక్షి'లో 'పేదల భూ ముల్లో పచ్చ గద్దలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సిబ్బందితో ఆగ్రామానికి వెళ్లి భూములను పరిశీలించారు. అందరి వద్ద ఉన్న భూ రికార్డులను పరిశీలించి సర్వే చేస్తామన్నారు.

ఐఐటీలో నేడు జాతీయ సదస్సు

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో గురువారం దేశీయ మ్యాపింగ్ తయారీపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు నవ ఆవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ పీడీ రోషణశ్రీవాత్సవ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఐఐటీ ముంబయి– ఫాసీ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రాంతాల వారీగా మ్యాప్ తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. సుమారు 25వేల మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా ఏపీ రెసిడెంట్ కమిషనర్ సౌరభ్‌గౌర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ ముంబాయి ప్రొఫెసర్ ఎం. కన్నన్ పాల్గొననున్నట్లు తెలిపారు.

దేశీయ గోజాతుల అభివృద్ధే లక్ష్యం

తిరుపతి రూరల్: దేశీయ గోజాతుల అభివృద్ధే లక్ష్యంగా టీటీడీ విస్తృతంగా అధ్యయనం చేస్తోంది. శ్రీవారికి నైవేద్యం సమర్పించేందుకు నిత్యం 4వేల లీటర్ల గోవు పాల సేకరించేందుకు కృషి చేస్తోంది. ఈ మేరకు టీటీడీ జేఈఓ సదాభార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి, వెటర్నరీ వర్సిటీ విస్తరణ సంచాలకుడు వెంకటనాయుడు బృందం మహారాష్ట్రలోని బారామతి కృషి విజ్ఞాన కేంద్రంలో పర్యటిస్తోంది. బుధవారం ఈ మేరకు జన్యు ప్రక్రియ ద్వారా దేశీయ గోజాతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించింది. టీటీడీ గోశాలలో రోజూ 4 వేల లీటర్ల స్వచ్ఛమైన దేశవాళీ ఆవు పాల దిగుబడికి అనుసరించాల్సి విధానాలపై శాస్త్రవేత్తలతో చర్చించింది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు యూత్ వింగ్ అధ్యక్షునిగా హేమంత్‌రెడ్డి, మహిళా విభాగానికి లీనారెడ్డి, రైతు విభాగానికి వెంకటరెడ్డి, బీసీ సెల్ సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్‌కు వెంకటస్వామి, ఎస్టీ సెల్‌కు నాగభూషణం నాయక్, పంచాయతీరాజ్ వింగ్‌కు ప్రతాప్‌రెడ్డిలను నియమించారు. అలాగే గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా అశ్వత్థ బాబు, వాణిజ్య విభాగానికి నాగరాజ వైఎస్‌ఆర్ సేవాదళ్‌కు కిశోర్ కుమార్, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు జ్యోత్స్న, పబ్లిసిటీ విభాగం రాజా, వైఎస్‌ఆర్‌టీయూసీ రాఘురామరెడ్డి, విద్యార్థి విభాగానికి జీవీ రవి, వైద్యుల విభాగానికి సంజీవరెడ్డి, వీవర్స్ విభాగానికి కన్నయారమ్ ను నియమించారు. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఈయన పేరు రామప్ప..



గుడుపల్లె మండలం, అత్తినత్తం రైతు. మూడేళ్ల కిందట ముగ్గురు కుమారులతో బెంగళూరుకు వెళ్లి బెల్దారు పని చేసుకుని జీవనం సాగించేవాడు. గ్రామంలోని రెండెకరాల పొలంలో రెండు బోర్లు వేసినా నీరు రాకపోవడంతో వలస తప్పలేదు. ప్రస్తుతం వర్షాలతో పుష్కలంగా నీరు చేరడంతో నాలుగు పాడి ఆవులతోకుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. ఏటా రైతు భరోసా, అమ్మ ఒడి, పెన్షన్ వస్తోంది. సాఫీగా కుటుంబ పోషణ సాగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నాడు.

ఈయన పేరు వెంకటేష్



అత్తినత్తం గ్రామానికి చెందిన ఈయన మూడేళ్ల కిందట బెంగళూరు వెళ్లి మేస్త్రీ పనులు చేసుకుని నిత్యం రాకపోకలు సాగించేవాడు. కష్టాలతో సతమతమై కుటుంబ పోషణ సాగించేవాడు. ప్రస్తుతం భూగర్భ జలాలు బాగా ఉండడంతో వ్యవసాయంతో పాటు పాడి ఆవులు చూసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు. ఏటా రైతు భరోసా, దివ్యాంగ పెన్షన్, చేయూత ద్వారా రూ.70వేలకు పైగా అందుతోంది. దీంతో కుటుంబా పోషణ సులభమైంది.

ఈయన పేరు నాగప్ప.




కుప్పం మండలం దాసేగొనూరు గ్రామం. నలుగురు సంతానం. భూమి ఉన్నా కరువుతో కూలి పనుల కోసం నిత్యం బెంగళూరుకు వెళ్లేవాడు. మూడేళ్లుగా వర్షాలు బాగా కురుస్తుండడంతో రెండెకరాల పొలంలో వివిధ రకాల పూలు, పంటలను సాగు చేసుకుని ఉపాధి పొందుతున్నాడు. రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుండడతో స్థానికంగానే ఉంటూ కుటుంబ పోషణ చేసుకుంటూ ఆనందనంగా ఉంటున్నానని చెబుతున్నాడు.

ఈయన పేరు వెంకటాచలం



దాసేగొనూరు గ్రామ రైతు. ఉన్న పొలంలో బోర్లన్ని ఎండిపోవడంతో భార్య, ముగ్గురు సంతానంతో పోషణకు బెంగళూరు పయనమయ్యాడు. ఇళ్లలో ఉద్యాన పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పాడిపై రుణాలు పొంది ఆవులను పోషించుకుంటున్నాడు. వలస పరిస్థితి మారింది. ఇంటి పట్టునే ఉంటూ పిల్లలను పోషించుకుంటున్నానని సగర్వంగా చెబుతున్నాడు.



వర్షాలు సకాలంలో రాకపోవడం.. ప్రభుత్వం పట్టించుకోక పోవడం.. కరువు కోరల్లో చిక్కుకున్న రైతులు పెద్ద ఎత్తున కూలి పనుల కోసం బెంగళూరుకు వలసపోయేవారు. ఇదంతా గతం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురిసి భూగర్భ జలాలు భారీగా పెరగడం.. ప్రభుత్వ సాయం తోడు కావడంతో స్థానికంగానే పంటలు సాగు చేసుకుంటూ నలుగురిలో సగౌరవంగా బతుకున్నారు. పాల ఉత్పత్తుల్లోనూ జిల్లాలో మొదటిస్థానంలో నిలిచేలా ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇది ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో చోటు చేసుకున్న మార్పులు.



అత్తినత్తం గ్రామం

నాడు వలస బాట...
నేడు అగ్రగామిగా..

- ఉపాధి లేక నాడు బెంగళూరు వైపు
- నేడు ప్రభుత్వ సాయంతో స్వగ్రామంలోనే పనులు
- భూగర్భ జలాల పెరుగుదలతో పెద్ద ఎత్తున వ్యవసాయం
- పాడి పరిశ్రమలో జిల్లాకే ఆదర్శం
- చంద్రబాబు నియోజకవర్గంలో నగర్వంగా బతుకుతున్న రైతులు

కుప్పం: చంద్రబాబు పాలనలో కరువుకు, వలసలకు కేరాఫ్‌గా నిలిచిన కుప్పం నియోజకవర్గంలో నేడు రైతులు తలెత్తుకునేలా బతికేలా స్థానికంగానే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. చంద్రబాబు పాలనలో వర్షాలు సకాలంలో రాకపోవడం.. ప్రభుత్వం పేద, బడుగు బలహీనులను పట్టించుకోక పోవడంతో జీవనాధారం లేక అవస్థలు పడేవారు. పెద్ద ఎత్తున నిత్యం కూలి పనుల కోసం బెంగళూరుకు వలసపోయేవారు. ప్రధానంగా కుప్పం, గుడుపల్లె మండలాల నుంచి నిత్యం పది వేల మందికి పైగా రైల్లో రాకపోకలు సాగించేవారు. ఉదయాన్నే 4 గంటలకు చలి, గాలులు, ప్రమాదాలకు తట్టుకుని ఏదో రాత్రికి ఇంటికి చేరుకునేవారు. నిత్యం దేవుడా ఎప్పుడు ఈ బాధల నుంచి విముక్తి అంటూ వేడుకునేవారు. కూలీలను ఆదుకోవాల్సిన టీడీపీ ప్రభుత్వం కనీసం ఉపాధి పనులు సైతం సక్రమంగా చూపక పోవడంతో కూలీల బాధలు వర్ణించడానికి వీలు లేకుండా పోయేది.



వలస కూలీలు తగ్గడంతో పుష్‌పుల్ రైలుకు తగ్గిన ప్రయాణికుల తాకిడి

మహానేత హయాంలో పథకాల తోడ్పాటు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో భారీ వర్షాలు నమోదయ్యాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లి గ్రామీణ జనం వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. వారికి అప్పటి పథకాలు తోడ్పాటు కావడంతో పెద్దగా సమస్యలు ఉండేవి కాదు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే వరుసగా ఐదు సంవత్సరాలు వర్షాలు లేక పోవడంతో గ్రామీణ జనం కూలీ పనులు లేక విలవిల్లాడిపోయారు.

తగ్గుముఖం పట్టిన వలసలు..

నిత్యం వేల సంఖ్యలో మల్లానూరు, కుప్పం, గుడుపల్లె, బిసానత్తం రైల్వే స్టేషన్ల నుంచి పనుల కోసం బెంగళూరు వెళ్లే కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ప్రభుత్వ సహాయ సహకారాలతో వలసలు తగ్గాయి. ఇందుకు నిదర్శనం గుడుపల్లె మండలం అత్తినత్తం గ్రామం. ఈ గ్రామంలో వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడి నుంచి 90 మంది నిత్యం బెంగళూరుకు వెళ్లి కూలీ పనులు చేసుకుని తిరుగుముఖం పట్టేవారు. ప్రస్తుతం పాడి పరిశ్రమతో దర్జాగా జీవిస్తున్నారు.

పాడితో ఉపాధి

ఒకప్పుడు పాడి అంటే పలమనేరు గుర్తుకు వచ్చేది. ఈ మూడేళ్ల కాలంలో పలమనేరుకు దీటుగా కుప్పం పాడిలో అభివృద్ధి చెందింది. పాల ధరలకు ప్రభుత్వం గిట్టుబాటు కల్పించడంతో 'వలస రైతులు పాడి రైతులుగా' స్థిరపడ్డారు. ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, చేయుత ద్వారా పాడి ఆవుల కొనుగోలుకు రుణాలు ఇస్తోంది. పాడి పరిశ్రమతో రైతులు ఉపాధి పొంది పాల ఉత్పత్తుల్లో జిల్లాలో మొదటిస్థానంలో నిలిపారు. ప్రతి రోజు 1.5 లక్షల లీటర్ల పాలు కుప్పం నుంచి ఎగుమతి చేస్తున్నారు. ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసుకుని, బోర్ల వద్ద పశుగ్రాసం సాగు చేస్తూ పాడి పరిశ్రమపై రైతులు మొగ్గు చూపారు.

ఒక్కసారిగా మార్పు..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్లుగా కుప్పంలో భారీ వర్షాలు నమోదు అవుతున్నాయి. రైతులు, రైతు కూలీలు బోర్లను మరమ్మతులు చేయించుకుని సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వీరికి రైతు భరోసా, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంలో ప్రభుత్వం సఫలీకృతం కావడంతో ఒక్కసారిగా రైతుల సమస్యలు తీరినట్లు అయింది. ఇంటి పట్టునే ఉంటూ ఆనందంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇంటిల్లి పాది చిరునవ్వుతో గడిపే పరిస్థితి వచ్చింది.

జనం జేజేల నడుమ నామినేషన్



నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు, మంత్రులు, ఎమ్మెల్యేలు



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మద్దతుదారులు

- గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలపు సురేశ్, ఆర్‌కేరోజా, కాకాణి గోవర్ధనరెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి
- తరలి వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు
- జైజగన్ నినాదాలతో మార్మోగిన చిత్తూరు

చిత్తూరు కలెక్టరేట్ : జనం జేజేల నడుమ ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్‌ల దాఖలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలపు సురేశ్, ఆర్‌కే రోజా, కాకాణి గోవర్ధనరెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలి వచ్చి అభ్యర్థులకు స్వాగతం పలికారు. ర్యాలీకి వచ్చిన వారందరూ వైఎస్సార్ సీపీపై అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు నృత్యాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అభ్యర్థులు ప్రజలకు నమస్కారం చేస్తూ నామినేషన్ కేంద్రానికి విచ్చేశారు. కలెక్టరేట్ వద్ద ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులతో కొంత మందే లోపలికి వెళ్లారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్‌కు అభ్యర్థులు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఎమ్మెల్సీలు భరత్, కల్యాణ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

వైఎస్సార్‌టీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పలు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, 1998 డీఎస్సీ సంఘం నాయకులు మద్దతు పలికి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే చిత్తూరు నగరంలోని కట్టమంచి బ్రిడ్జి వద్ద నుంచి పీడీఎఫ్ పోటీ ఎమ్మెల్సీ అభ్యర్థులు బాబురెడ్డి, వెంకటేశ్వర రెడ్డిలతో పాటు యూటీఎఫ్, పలు వామపక్ష పార్టీల నాయకులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు నామినేషన్ దాఖలు చేశారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

మంత్రి రోజా, తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే గ్రాడ్యుయేట్‌ల సమస్యలపై గళం వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ ఇతర అణగారిన అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేసేలా అభ్యర్థులను ప్రకటించారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే, అభ్యర్థులను గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తారని పేర్కొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసిన అనంతరం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని పేర్కొన్నారు. వడ్డెర మాదిగ, మాల ఇలా అన్ని కులాలను గుర్తించి సీట్లు కేటాయించారని తెలిపారు. చంద్రబాబు కేవలం మాటల మనిషి అని విమర్శించారు. బీసీ ఓట్లతో గెలిచి బీసీలకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. సీఎం జగన్ బీసీలకు పెద్దపీట వేసి ఇచ్చిన మాట నెరవేర్చారని తెలిపారు.


చరిత్ర సృష్టించిన సీఎం

బీసీలకు 61శాతం ఎమ్మెల్సీ అభ్యర్థుగా సీట్లు కేటాయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బీసీలకు పెద్దపీట వేస్తున్నారనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. మాటలు కాకుండా హామీలను సీఎం జగన్ చేతల్లో చూపించడంతో బీసీలందరూ అండగా ఉన్నారన్నారు.

పట్టభద్రులకు 15 టీచర్‌కు 6

- పకడ్బందీగా ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నేటితో ముగియనున్న గడువు





నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో ప్రతిపాదకులుగా మంత్రులు

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం 21 నామినేషన్లు దాఖలు అయ్యాయి. బుధవారం ఉదయం 11 ప్రారంభమైన నామినేషన్‌ల స్వీకరణ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్లను స్వీకరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రక్రియ జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నామినేషన్‌ల ప్రక్రియ ఘట్టాన్ని వీడియోతో చిత్రీకరించారు.గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలకు గురువారం చివరి గడువని అధికారులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నేటి శ్యాంప్రసాద్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పలు పార్టీల, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. పట్టభద్రులకు 15, ఉపాధ్యాయ ఎన్నికలకు ఆరు నామినేషన్‌లు దాఖలు అయినట్లు అధికారులు వెల్లడించారు.

పట్టభద్రులకు : వైఎస్సార్‌సీపీ అనుబంధంగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, హేమ సుస్మిత పేర్నాటి, ఇండిపెండెంట్‌లుగా రాయపాటి జగదీశ్, పళ్లిపట్టు అభినవ్ విష్ణు, గిరి శ్రీనివాసరావు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పంతంగి పాకంకరెడ్డి, వీరభద్రాచారి, దొడ్ల శ్రీహరి, పూసల రవి, అంకయ్య చౌదరి, శివప్రసాద్‌రెడ్డి, నక్కా దినేష్‌కంచర్ల శ్రీకాంత్ చౌదరి (టీడీపీ అనుబంధం), కంచర్ల సరిత (టీడీపీ అనుబంధం) నామినేషన్‌లు దాఖలు చేశారు.

ఉపాధ్యాయ స్థానానికి : చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి, ప్రవీణా పర్వతరెడ్డి, కుట్టుబోయిన బ్రహ్మానందం, బాబురెడ్డి పొక్కిరెడ్డి, ధనంజయ శివయోగి, చిన రమణారెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారు.

ఓటర్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల తుది జాబితాను రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ వెంకటేశ్వర్ బుధవారం విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో 155, తిరుపతి పరిధిలో 194, నగరి పరిధిలో 108, చిత్తూరులో 187, పలమనేరులో 222, కుప్పంలో 99, మదనపల్లెలో 255 మొత్తం 1220 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన ప్రకటించారు.

ఆ తహసీల్దార్‌కు ఎన్నికల విధులు వద్దు

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్ పార్వతిని ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నుంచి తప్పించాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు దూరంగా ఉండాలని అందులో పేర్కొంది. కాగా ఎన్నికల విధులు తప్ప మిగిలిన విధి విధానాల్లో యథావిధిగా కొనసాగుతారని అధికారులు పేర్కొన్నారు.


ఉనికి కోసం చంద్రబాబు అడ్డదారులు



కాణిపాకం ఆలయంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

కాణిపాకం(యాదమరి): ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఉనికి కోసం నానా తంటాలు పడుతున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత విమర్శించారు. పోలీసులు రాజకీయ నాయకులు కాదని, ఉద్యోగులని అన్ని పార్టీలు వారికి సమానమని తెలిపారు. మంత్రి వనిత బుధవారం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆమె ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి 98శాతం హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. టీడీపీపై ప్రజలకు నమ్మకం లేకపోవడంతో ఉనికిని కోల్పోతామని చంద్రబాబు ఆపార్టీ చోటా నాయకులను రెచ్చగొట్టి దాడులకు ఉసి గొల్పుతున్నారని ఆరోపించారు. పోలీసు శాఖపై అవాస్తవ ఆరోపణలు చేయడం చూస్తుంటే మతిపోయినట్లు అనిపిస్తోందన్నారు.

భూ ఆక్రమణలను నిరూపిస్తే రాజీనామా



నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

శ్రీరంగరాజపురం : భూ అక్రమాలకు తాను పాల్పడినట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేసి శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని, అలా నిరూపించ లేని పక్షంలో చంద్రబాబు నాయుడు, లోకేష్ శాశ్వతంగా రాజకీయం సన్యాసం తీసుకుంటారా అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి సవాలు విసిరారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను లంచం తీసుకున్నట్లు నిరుపిస్తే వారి పాదాలకు నమస్కరించి రాజకీయల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. 2ఎకరాల భూమి ఉన్న చంద్రబాబుకు ఇప్పుడు వేల ఎకరాలు, లక్షల కోట్లు ఏలా వచ్చాయని ప్రశ్నించారు. 'నీ ప్రభుత్వ హయాంలో 14ఏళ్లు నువ్వు చేసిన అవినీతిపై బహిరంగా చర్చకు సిద్ధమా' అని సవాల్ విసిరారు.

క్లుప్తంగా

దళితుడు అన్నదానం చేస్తే అడ్డుకుంటారా?

పలమనేరు: మండల కేంద్రమైన శాంతిపురంలో ఇటీవల అన్నదానం చేస్తున్న ఓ దళితుడిని అడ్డుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానిక మానవ హక్కుల సంస్థ అధ్యక్షుడు మునిరత్నం ఓ ప్రకటనలో కోరారు. శాంతిపురానికి చెందిన జేపీ వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు జైప్రకాష్‌ను అక్కడికి చెందిన అగ్రకులానికి చెందిన వారు అడ్డుకోవడం తగదని తెలిపారు. దళితుడు అన్నదానం చేయకూడదా అని ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కౌండిన్య నదిలో మృతదేహం


నదిలో తేలాడుతున్న మృతదేహం

గంగవరం: మండలంలో తమ్మిరెడ్డిపల్లి గ్రామం అనుకుని కౌండిన్య నదిలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. నదిలో వ్యక్తి మృతదేహం తేలాడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నదిలో నుంచి వెలికితీశారు. మృతదేహాన్ని పరిశీలించగా శరీరం కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో నాలుగైదు రోజులు క్రితమే నదిలో పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెంది ఉంటాడా ? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అలాగే మృతుడు ఎవరనేది తెలియరాలేదు. మృతుడి శరీరంపై ఫుల్ షర్టు, డ్రాయర్ జేబులో నిమ్మకాయలు, పసుపు ఉన్నాయని, ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

చిట్స్ మోసాలకు చెక్

చిట్స్ కంపెనీలు నిబంధనలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మోసాలకు చెక్ పెట్టడం ద్వారా ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు అధికారులు దృష్టి సారిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చిట్స్ కట్టించుకుని సకాలంలో ఇవ్వడం లేదని ఫిర్యాదులు రావడంతో వాటిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. నిబంధనలను కచ్చితంగా పాటించాలని లేకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. చిట్ పాడుకున్నవారికి వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలని ఆదేశించింది. దీంతో ఇటీవల చిట్స్ నిర్వాహకులతో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. చిట్స్ ఖాతాలు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

- నిబంధలు కచ్చితంగా పాటించేలా చర్యలు
- చిట్ పాడుకున్నవారికి వెంటనే సొమ్ము చెల్లించేలా ఆదేశం
- ఉమ్మడి జిల్లాల్లో 35 చిట్ కంపెనీలు
- నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు




చిట్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన డీఆర్ శ్రీనివాసరావు(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: చిట్స్ కంపెనీల మోసాలపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ప్రజలు మోసపోకుండా కంపెనీలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఇటీవల చిత్తూరుకు చెందిన ఓ చిట్‌ఫండ్ కంపెనీ నిబంధనలు పాటించడం లేదని వినియోదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కారించారు. అదే విధంగా తిరుపతిలోని ఓ చిట్‌ఫండ్ కంపెనీ పరంగా సమస్య వస్తే అక్కడి అధికారులకు సమస్యను తెలియజేశారు. చిట్టీ సొమ్ము సమయానికి ఇవ్వడం లేదని ఇలా పలు రకాలు ఫిర్యాదు వస్తున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం చిట్స్ వేయడం, పాటలు నిర్వహించి, సమయానికి సొమ్ములు ఇవ్వకపోవడం, చిట్స్‌కు సంబంధించిన ఖాతాల్లో సొమ్ము ఉండకపోవడం, కొన్ని చిట్స్ కంపెనీలు అనేక మోసాలకు పాల్పడుతుండడంతో ప్రజలు నష్టపోతున్నారు. ఇలా ప్రజలను నిలువునా ముంచేస్తున్న చిట్స్ సంస్థలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నష్టపోయారు. దీనిని గుర్తించి ప్రస్తుతం ప్రభుత్వం చిట్స్ కంపెనీలు నిబంధనల పాటించే విధంగా చర్యలు తీసుకుంటోంది.

నిబంధనలు

- ఉమ్మడి జిల్లాలో రిజిస్టర్ అయిన చిట్‌ఫండ్ కంపెనీలు 38 ఉన్నాయి.
- కొత్తగా చిట్స్ ప్రారంభించాలన్నా ఇప్పటికే చిట్ అనుమతి పొందినా ఆయా సంస్థలు తప్పనిసరిగా చిట్‌ఫండ్ చట్టం 1982లోని నిబంధనలు పాటించాలి.
- నిబంధనలు పాటించకపోయినా, పాట అయిన తర్వాత పాటదారుకు సమయానికి సొమ్ము చెల్లించకపోయినా చర్యలు తీసుకుంటారు.
- చిట్స్ ఖాతాలు నిర్వహిస్తున్నారో లేదో అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. చిట్‌ఫండ్ కంపెనీ పేరు మీద మాత్రమే చిట్స్ నడపాలి.
- చీటి కట్టిన వారికి ఎటువంటి సమస్యలు ఎదురైనా జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయం పాటదారులందరికి తెలిసేలా ప్రతి చిట్‌ఫండ్ కంపెనీ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి.
- చిట్‌ఫండ్ చట్టం రూల్ 28 సెక్షన్ 24 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించేవారు ప్రతి చిట్ గ్రూప్‌నకు ఆస్తులు, అప్పులు, ఖర్చులు, బిల్లులను ఫారమ్–21లో నమోదు చేసి అందజేయాలి.
- చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించే వారికి మూడు బ్యాంక్ అకౌంట్లు ఉండాలి. మొదటి అకౌంట్‌లో పాటదారుల చెల్లింపుల వ్యవహారాలు ఉండాలి. చిట్టీ పాడిన తర్వాత ఆ సొమ్మును పాటదారులు తీసుకోకపోతే రెండో అకౌంట్‌లో ఉంచాలి.
- ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులు మూడో అకౌంట్‌లో ఉంచాలి. ఈ అకౌంట్లకు సంబంధించి ప్రతినెల బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు అందజేయాలి.
- రికార్డులు, ఖాతాలు సక్రమంగా నమోదు చేయాలి.
- ఆడిట్ సమయంలో అక్రమాలు జరిగినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవు.

నిబంధనలు పాటించాలి

చిట్ కంపెనీలు నిబంధనలు పాటించాలి కొత్తవి అయిన పాతవి అయిన చట్టం –1982 నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. నిబంధనల ప్రకారం సంబంధిత డ్యాకుమెంట్లను అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ పరిశీలించిన అనంతరమే అనుమతులు ఇస్తారు. చీటి కట్టిన వారికి ఎటువంటి సమస్యలు ఎదురైనా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం.

– శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్

తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ


అనసూయమ్మ ఇంట్లో ధ్వంసమైన బీరువా

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ పరిధిలోని తాళ వేసి ఉన్న రెండు ఇళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లోకి చొరబడి బీరువాలు పగుల గొట్టి బంగారు, వెండి నగలు, నగదును దుండగులు చోరీ చేశారు. ఈమేరకు బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. పాళ్యెంవీధికి చెందిన అనసూయమ్మ ఐదు రోజుల కిందట ఇంటికి తాళం వేసి బెంగళూరులో ఉన్న కుమారుడు శివ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం తలుపులు తెరచి ఉండడం, బీరువా పగులగొట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించి ఆమెకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి ఇంటిని పరిశీలించగా బీరువా పగల గొట్టి ఉన్నారు. అందులోని కిలో వెండి నగలు, తాళిబొట్టు, ఉంగరం కనిపించలేదు. అలాగే అదే వీధికి చెందిన ఎస్.రెడ్డెప్ప రెండు రోజుల కిందట బెంగళూరులో ఉన్న కుమారుడి దగ్గరకు వెళ్లారు. ఈ ఇల్లు కూడా తెరచి ఉండడం, బీరువా పగులగొట్టి ఉండడాన్ని చుట్టుపక్కల వారు గుర్తించి ఆయన సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పరిశీలించగా బీరువాలోని రూ.1,02 లక్షల నగదు, 800 గ్రాముల వెండి నగలు, జత కమ్మలు చోరీ అయి ఉన్నాయి. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండిళ్లలో చోరీ కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

జార్ఖండ్‌లో కుప్పం మహిళ


జార్ఖండ్‌లో ఆశ్రయం పొందుతున్న సావిత్రమ్మ

కుప్పంరూరల్: మతిస్థిమితం లేని ఓ మహిళ జార్ఖండ్ రాష్ట్రం దేవ్‌ఘడ్‌లో ఆశ్రయం పొందుతోంది. ఆమెను వాకబు చేస్తే తన పేరు సావిత్రమ్మ అని, ఊరు కుప్పం అని చెబుతోంది. ఆమె ఆచూకీ తెలిస్తే కుప్పం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు కలిగి, నీలం, తెలుపు రంగు చీర ధరించి ఉందన్నారు. వివరాలు తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పీఈఎస్ వైద్యవిద్యార్థుల ప్రతిభ


బాల విఖిత


బత్తిని సాయిశ్రీ

గుడుపల్లె: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో పీఈఎస్ కళాశాల నిలిచిందన్నారు. తమ పీఈఎస్ కళాశాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో బాలవిఖిత, బత్తిని సాయిశ్రీ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత పొందారని తెలిపారు. వీరికి ఈ నెల 25వ తేదీ నుంచి హౌస్ సర్జరీ ప్రోగ్రాం ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ప్రతిభ చూపిన వైద్య విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం: నగరి వాసి మృతి

- మరో 9 మందికి గాయాలు


హరికృష్ణ (ఫైల్)


బస్సును ఢీకొని నుజ్జైన వాహనం

నగరి : తమిళనాడు పుదుక్కోట్టై షిప్‌కార్ట్ సమీపం బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరి మున్సిపాలిటీ కీళపట్టుకు చెందిన డ్రైవర్ హరికృష్ణ (26) అక్కడికక్కడే మృతిచెందగా, వాహనంలో ప్రయాణించిన నగరి పట్టణం వీకేఎస్ లేఅవుట్‌కు చెందిన 9 మందికి గాయాలయ్యాయి. హరికృష్ణ సంతలో తండ్రి శంకర్‌తో కలిసి కరివేపాకు విక్రయిస్తూ అందరికీ పరిచయస్తుడు. వీరి కుటుంబం 25 ఏళ్లుగా సంతలో కరివేపాకు వ్యాపారం చేస్తోంది. ఇటీవల ఎర్టిగా వాహనాన్ని కొనుగోలు చేసిన హరికృష్ణ ట్రావెల్స్ కూడా నడుపుతున్నాడు. ఈ క్రమంలో కీళపట్టులో కిరాణాకొట్టు పెట్టుకున్న మునియపెరుమాళ్ నాడార్ (60) కుటుంబంతో సహా తమిళనాడులోని తన స్వగ్రామం కారైకుడి వెళ్లడానికి వాహనాన్ని బుక్ చేసుకున్నాడు. మంగవారం రాత్రి వీకేఎస్ లేవుట్ నుంచి నాడార్ కుటుంబసభ్యులను తీసుకుని హరికృష్ణ కారైకుడికి బయలుదేరాడు. బుధవారం ఉదయం తమిళనాడు పుదుక్కోట్టై షిప్‌కార్ట్ సమీపం వెళుతుండగా ఎదురుగా వస్తున్న ప్రభుత్వ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హరికృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణించిన మునియపెరుమాళ్ నాడార్ కుటుంబ సభ్యులు ఆరుగురితో పాటు బస్సులో ప్రయాణించిన ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని అక్కడే ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య సేవల నిమిత్తం తరలించారు. వీరి ప్రాణాలకు ప్రమాదం లేదని వైద్యులు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారి పరిస్థితిపై కీళపట్టులోని స్థానిక నాయకులను మంత్రి ఆర్కేరోజా ఆరాతీశారు. వారికి అవసరమైన సహాయక చర్యలు అందిచాలన్నారు.

రూ.1.70 లక్షల కర్ణాటక మద్యం పట్టివేత



గంగవరం: కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి గ్రామాల్లో విక్రేతలకు సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితులను సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చూపించి, రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. పసుపత్తూరు పంచాయతీ మార్జేపల్లెకు చెందిన ఆనంద్, పెద్దపంజాణి మండలం అప్పినపల్లెకు చెందిన మంజునాథ్, చిన్నరాజు కొంతకాలంగా కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి మేలుమాయి పరిసర ప్రాంతాల్లోని విక్రేతలకు సరఫరా చేస్తున్నారు. కర్ణాటకకు చెందిన చక్రి అనే వ్యక్తి వీరికి మధ్యవర్తిగా ఉంటూ తక్కువ ధరకు మద్యం కేసులను షాపుల వద్ద ఇప్పించేవాడు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాల్లో రూ.1.70 లక్షలు విలువ చేసే మద్యం కేసులు సంచుల్లో తీసుకొస్తుండగా మల్లేరు సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆనంద్, మంజునాథ్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌లు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గో బ్యాక్.. పప్పు !


పోలీసులపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి, తిరుపతి/రేణిగుంట: యువగళం పేరుతో నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రలో ఏర్పేడు మండలంలో బుధవారం అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. 'గో బ్యాక్ పప్పు' అంటూ పంపిణీ చేసిన కరపత్రాలు దారిపొడవునా కనిపించాయి. ఆ కరపత్రాల్లో.. "16మంది ప్రాణాలు తీసిన ఇసుకాసులను వెంటబెట్టుకుని చేసే పాదయాత్ర ఎవరి కోసం..? మనుషుల ప్రాణాలు తీసిన రాక్షసుల కోసమా..? మరొకసారి ప్రజలను వెన్నుపోటు పొడవడం కోసమా..? అసత్య ఆరోపణల యాత్రను ప్రజలు స్వాగతించరు.. గత హామీలను నెరవేర్చలేని మీ పాలన ఎందుకు..? గో బ్యాక్ పప్పు" అంటూ 2017 ఏప్రిల్ 21న ఏర్పేడులో జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల ఫొటోలతో కూడిన కరపత్రాలు నారా లోకేష్ పర్యటించే ప్రాంతంలో పలుచోట్ల రోడ్డుపై కనిపించాయి.

రెచ్చగొట్టి.. రచ్చ చేశారు

మునగలపాలెం, వికృతమాల మీదుగా మర్రిమందకు చేరుకున్న పాదయాత్రలో టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టి రచ్చ చేశాయి. మర్రిమంద పాఠశాలలో స్థానికులు ఉండడాన్ని గమనించిన టీడీపీ శ్రేణులు దుష్ప్రచారం చేశారు. పాదయాత్రలో లోకేష్‌పై రాళ్లు రువ్వడానికి పాఠశాలలో ఉన్నారంటూ గొడవకు దిగారు. పాఠశాలలో ఉన్న స్థానికులపై టీడీపీ శ్రేణులు, విజయవాడకు చెందిన ప్రైవేటు సైన్యం దాడిచేయడానికి యత్నించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ శ్రేణులు మాత్రం అగకుండా నెట్టుకుంటూ పోలీసులపై దాడికి దిగారు. పోలీసులు టీడీపీ కార్యకర్తలను శాంతింపజేసేందుకు తీవ్రంగా శ్రమించారు. అయినా వినకుండా రెచ్చిపోయారు. స్థానికులు, పోలీసులపై దాడులకు తెగబడ్డారు.



పరమ పావనం..
కైలాస గిరి ప్రదక్షిణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం నూతన వధూవరులైన ఆదిదంపతులు బుధవారం ఉదయం కైలాసగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. విల్లు, బాణాలు ధరించిన స్వామివారు, అమ్మవారితో కలిసి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివెళ్లారు. కొండచుట్టు ఉత్సవంలో విదేశీ భక్తులు సందడి చేశారు. శివనామస్మరణ చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీవాణిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, ఆకర్ష్‌రెడ్డి, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు. రాత్రి ముక్కంటి అశ్వవాహనం, జగజ్జనని సింహవాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ క్రమంలో గురువారం స్వామివారి ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణంకానున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

– తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్)



